క్లుప్తంగా

భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణంలో పాల్గొన్న గీతా మండలి సభ్యులు

నరసన్నపేట: విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని కృష్ణాలయంలో మంగళవారం భగవద్గీత పారాయణం చేశామని స్థానిక గీతా మందిరం నిర్వాహకులు సూరిబాబు తెలిపారు. గీతా మండలి సభ్యులు 26 మంది పాల్గొన్నట్లు తెలిపారు. అష్టాదశ క్షేత్ర పారాయణం సందర్భంగా పురాతన వేణుగోపాలస్వామి క్షేత్రాలకు వెళ్లి భగవద్గీతను పారాయణం చేస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని శ్రావణ మాసంలో ప్రారంభించామన్నారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలను 18 శ్రీకృష్ణ క్షేత్రాల్లో పారాయణం చేసేందుకు సంకల్పించామన్నారు. ఇప్పటివరకు 12 ఆలయాల్లో పూర్తిచేశామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పాతపట్నం: మండలంలోని ఎ.ఎస్.కవిటి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై పర్లాకిమిడికి చెందిన సెంచూరియన్ యూనివర్సిటీ అగ్రికల్చర్ సీనియర్ విద్యార్థులు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. వర్మికంపోస్ట్, ప్లాంటేషన్ డ్రైవ్, చెట్లు వల్ల ఉపయోగాలు, ప్రకృతితో ఉపయోగం వంటి వివరాలు రైతులకు తెలియజేశారు. వేస్ట్ డీకంపోజర్ ఎలా తయారుచేయాలి, వాటి ప్రయోజనాలు, ఉపయోగాలను వివరించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు

బూర్జ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మండల జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు ఆధ్వర్యంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శిలు, మహిళా పోలీసులకు బాలల లైంగిక నేరాల నిషేధిత చట్టం-2012, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఎస్.గీతారాణి, ఎంఈఓ-2 బి.ధనుంజయరావు, ఏపీఎం పి.బాబూరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బల్ల పండగ



బల్ల పండగలో పాల్గొన్న రజకులు

హిరమండలం: బల్ల పండగను స్థానిక దుర్గ రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చెవిటమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లతో హిరమండలం ప్రధాన రహదారిలో ఊరేగింపుగా వెళ్లి వంశధార నది ఒడ్డున బల్ల పండగ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రోణంకి రాము, సభ్యులు నరేష్, హరి, రామకృష్ణ, కొండ మల్లి తదితరులు పాల్గొన్నారు.

137 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు రత్నంరాజు

పొందూరు: స్థానిక సత్యసాయి సేవా మందిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సీనియర్ ఆప్తాలమిక్ అధికారి ఎస్.రత్నంరాజు 137 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 37 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. శంకర్ ఫౌండేషన్ సిబ్బంది, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగువాడ రైల్వే గేటు మూసివేత

పాతపట్నం: గంగువాడ గ్రామానికి అనుకుని ఉన్న రైల్వే గేటును బుధవారం ఉదయం 10 నుంచి 4 గంటల వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గేటు మరమ్మతుల నేపథ్యంలో పాతపట్నం-టెక్కలి మధ్య వాహన రాకపోకలకు అంతరాయం ఉంటుందన్నారు. టెక్కలి నుంచి వచ్చే వాహనాలకు తెంబూరు మీదుగా సారవకోటకు దారి మళ్లించామన్నారు. వాహనదారులు, ప్రజలు గమనించాలన్నారు.

ఇంటివద్దకే రేషన్



చెవ్వాకులపేటలో రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు



- సుదూర కష్టం తీరింది
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసిన లబ్ధిదారులు

గ్రామం	రేషన్ కార్డులు	లబ్ధిదారులు
రామచంద్రాపురం	102	520
చెవ్వాకులపేట	62	339

ఆమదాలవలస రూరల్: రేషన్ సరుకుల కోసం గతంలో డిపోల వద్ద గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి. కిలో మీటర్ల మేర నడుచుకుని వెళ్లాల్సి వచ్చేంది. ఒకటి, రెండు రోజులు పట్టే సందర్భాలు అనేకం. కూలి పనిచేసే వారికి ఇది మరింత ఇబ్బందిగా ఉండేది. వృద్ధులు, దివ్యాంగులు మరిన్ని అవస్థలు పడేవారు. దీనికి ఉదాహరణే ఆమదాలవలస మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పరిధిలో ఉన్న ఆనందపురం, చెవ్వాకులపేట. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే రేషన్ వాహనం అందుబాటులోకి తీసుకువచ్చి ఇంటి వద్దకే సరుకులు అందిస్తున్నారు. దీంతో తమ గ్రామాల రేషన్‌కార్డుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ కష్టాలు తీరాయి



పేదలకు అందించే రేషన్ సరుకులు తీసుకోవాలంటే గతంలో చాలా కష్టాలు పడితే కానీ రేషన్ సరుకులు వచ్చేవి కావు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ కష్టాలు గట్టెక్కాయి. రేషన్ సరుకులు కోసం నడుచుకుని ఉదయం వెళితే మధ్యాహ్నం అయ్యేది. నెలవారీ రేషన్ కోసం ఒక రోజు భోజనం మానుకుని వెళితేనే సరుకులు అందే పరిస్థితి గతంలో ఉండేది. ఇప్పుడు రేషన్ సరుకులు నేరుగా మా ఇంటి వద్దకు వచ్చి వాహనం ద్వారా అందిస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన నేరుగా ఇంటి వద్దకు రేషన్ తీసుకువచ్చి క్షణంలో సరుకులు అందజేయడం సంతోషంగా ఉంది.

– బైరి నిర్మల, ఆనందపురం, ఆమదాలవలస మండలం

కిలో మీటర్ల దూరం నడిచే కష్టం తప్పింది



రేషన్ సరుకుల కోసం కిలో మీటర్ల దూరం నడిచే కష్టం తప్పింది. గ్రామానికే వచ్చి రేషన్ సరుకులు ఇచ్చేలా ఏర్పాట్లు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా గ్రామం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. పేదలకు అందించే సరుకులు నేరుగా గడప వద్దకే తీసుకువచ్చి సమయానికి అందజేయడం సంతోషంగా ఉంది. పేదల ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– గౌరమ్మ, చెవ్వాకులపేట, ఆమదాలవలస మండలం

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



డాన్స్ చేస్తున్న విద్యార్థులు

కొత్తూరు: నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, రిటైర్డ్ హెచ్‌ఎం ఎద్దు గోపాలదాసు నాయుడు మాట్లాడారు. ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలంటే క్రమశిక్షణ అవసరమన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. 2023 ఫలితాల్లో ప్రథమ సంవత్సరం సీఈసీ విద్యార్థిని ఎ.మీనా, ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని మహాలక్ష్మికి కాలేజీలో అత్యధిక మార్కులు రావడంతో ఎద్దు సుందరనారాయణ వరహాలమ్మ ట్రస్టు చైర్మన్ గోపాదాసునాయుడు రూ.500 చొప్పున నగదు ప్రోత్సాహం అందజేశారు. కాలేజీకి అభివృద్ధికి విరాళాలు సేకరిస్తే తనవంతుగా కొంత మొత్తం ఇస్తానని ప్రకటించారు. కళాశాల అధ్యాపకుడు ఆదినారాయణ, మాజీ సర్పంచ్‌లు టి.వి.రమణారావు, నూలు వీరభద్రస్వామి, మీసాల సోమేశ్వరరావు, ఏజీపీ రాడ రాజు, రిటైర్డ్ ఉప తహసీల్దార్ గణేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇళ్ల రిజిస్ట్రేషన్లు



కొత్తూరులో రిజిస్ట్రేషన్ చేస్తున్న వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్

కొత్తూరు: మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఇళ్ల పట్టాలను గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా 748 ఇళ్ల పట్టాలకు ఇంతవరకు 235 పట్టాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్‌లు రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు.

కొత్తూరు-1, 2, నివగాం గ్రామ సచివాలయాల్లో అధికంగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇంతవరకు రాయల, ఇరపాడు, కర్లెమ్మ, దిమిలి, వసప, ఇరపాడు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు ప్రారంభం కాలేదు.

108 వాహన సేవలపై ఆరా



మెళియాపుట్టి: మందులను పరిశీలిస్తున్న జగన్నాథరావు

పాతపట్నం/మెళియాపుట్టి: ప్రభుత్వ నిబంధనల ప్రకారం 108 వాహనంలో మందులు, పరికరాలు ఉండాలని, ఆక్సిజన్ ఎప్పటికప్పుడు నిల్వ ఉంచాలని పలాస డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ అధికారి జగన్నాథరావు అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆస్పత్రి ఆవరణలో ఉన్న 108, మెళియాపుట్టి మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద ఉన్న 108 వాహనాలను మంగళవారం తనిఖీ చేశారు. వాహనాల పనితీరును పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, విధులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఫోన్ వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. పాతపట్నం మెడికల్ టెక్నీషియన్ కె.ఆఫీస్, పైలెట్ గోపాలకృష్ణ, మెళియాపుట్టి మెడికల్ టెక్నీషియన్ సరోజిని, పైలట్ రాంబాబు ఉన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంఈఓ రమణ

సారవకోట: కిడిమి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం సరస్వతీదేవి విగ్రహాన్ని ఎంఈఓ ఎం.వి.రమణ ఆవిష్కరించారు. ఈ పాఠశాలలో 2016 నుంచి 2019 వరకు ఉపాధ్యాయుడిగా కూన వెంకటకృష్ణ విధులు నిర్వహించారు. ఈయన సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. మండలంలోని తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో హెచ్‌ఎం ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ తల్లిదండ్రులే వందమంది ఉపాధ్యాయులతో సమానమన్నారు. విద్యార్థులు ఇంటివద్ద శ్రద్ధగా చదువుతున్నది, లేనిది తల్లిదండ్రులే గమనించాలన్నారు. పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో సమయం వృథా కాకుండా చూడాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి శత శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. పీఎంసీ చైర్మన్ ఎం.ఖగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధి దీపాలు వేయాలి

నరసన్నపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి గాంధీనగర్ రోడ్డులో వీధి లైట్లు వేయాలని సర్పంచ్ బూరల్లి శంకర్‌ను సిటిజెన్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఆర్.కృష్ణారావు, పూర్ణారావు కోరారు. ఈ మేరకు మంగళవారం సర్పంచ్‌కు వినతిపత్రం అందజేశారు. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో భయంగా ఉందన్నారు. వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు వేయాలని కోరారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

కొత్తూరు: మండలంలోని కారిగూడ గిరిజన గ్రామానికి చెందిన సవర శ్రీరామ్ 5 లీటర్ల నాటుతో పట్టుబడినట్లు ఎస్ఐ ఎం.ఎ.అహ్మద్ తెలిపారు. ఒడిశా నుంచి సారాను అక్రమంగా తరలిస్తుండగా మాకవరం కూడలి వద్ద మంగళవారం పట్టుకున్నామన్నారు. సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. శ్రీరామ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన వి.జగన్నాథం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు మంగళవారం విరాళ నగదును ఆలయ సిబ్బంది బి.ఎస్. చక్రవర్తికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ దాలినాయుడు

నరసన్నపేట: ప్రభుత్వం పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ పేడాడ దాలినాయుడు అన్నారు. చిన్నకరగాం ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాలలో పరిశుభ్రత, విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ సరైన ప్రణాళికతో విద్యా బోధన చేపట్టాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. వంట ఏజెన్సీ మహిళలకు సూచనలు చేశారు. పరిశీలకులు హెచ్.ఆనందరావు, సీఆర్ఎంటీ జి.శ్రీనివాసరావు ఉన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం



నరసన్నపేట: మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆరంగి మురళి



ఎల్.ఎన్.పేట: మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి



సారవకోట: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



జలుమూరు: పేర్లు రిజిస్ట్రేషన్ చేసి మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఎల్.ఎన్.పేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ వైద్య సేవలు అందించటం జరుగుతుందని ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దకొల్లివలస గ్రామ సచివాలయం వద్ద మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. సర్పంచ్ రావాడ రాజేశ్వరి, ఎంపీడీఓ గిరిబాల, లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు పి.ప్రియాంక, ఈఓపీఆర్డీ ఐ.పద్మజ, ఎంపీటీసీ తులసమ్మ, గ్రామ సచివాలయ కార్యదర్శి బి.వెంకటేశ్వరమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జోనంకిలో..

జలుమూరు: జోనంకిలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 352 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు జలుమూరు మెడికల్ అధికారి చల్ల వంశీకృష్ణ మంగళవారం తెలిపారు. ఇద్దరిని శ్రీకాకుళం రిఫర్ చేశామన్నారు. జోనంకి పరిధిలోని అబ్బాయిపేట, కె.ఎల్.ఎన్.పేట, గంగాధరపేట గ్రామాలతోపాటు పరిసర గ్రామాలు ప్రజలు ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకున్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుడితిలో

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 403 మంది వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సారవకోట పీహెచ్‌సీ వైద్యురాలు దేవిక తెలిపారు. సారవకోట పీహెచ్‌సీ వైద్యులతోపాటు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు హాజరై రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీఓ రాంబాబు, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి నిక్కు రాజశేఖర్, పార్టీ నాయకులు మెండ రామకృష్ణ, జాడ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపెంటో..

నరసన్నపేట: గోపాలపెంటలో మాకివలస పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 289 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని ఎంపీపీ ఆరంగి మురళి ప్రారంభించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సర్పంచ్ ఎండ కృష్ణవేణి, ఎంపీటీసీ సభ్యుడు గదిలి మల్లేశ్వరరావు, అటవీ శాఖ డైరెక్టర్ బొబ్బాది ఈశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు శిరీష, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

9న డీవార్మింగ్ డే



సారవకోట: అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సారవకోట: మండలంలోని బొంతు పీహెచ్‌సీ పరిధిలో ఈ నెల 9న నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీహెచ్ఓ గణిబాబు మంగళవారం తెలిపారు. పీహెచ్‌సీలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 48 పాఠశాలలు, 52 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 2,707 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది హేమలత, ఏఎన్ఎం రత్నపాప తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా మాత్రలు..

బూర్జ: ఈ నెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆల్బెండ జోల్ మాత్రలను మండలంలోని అన్ని పాఠశాలలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలన్నారు. ఎంఈఓ కార్యాలయం నుంచి సంబంధిత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 బి.ధనుంజయరావు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



పాతపట్నంలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకన్నబాబు

కుల గణన పరిశీలన

పాతపట్నం: మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చేపడుతున్న కుల గణన సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.వెంకన్నబాబు అన్నారు. పాతపట్నం మేజర్ పంచాయతీలోని పలు వీధులతోపాటు బూరగాం గ్రామంలో మంగళవారం చేపట్టిన కులగణన సర్వేను ఎంపీడీఓ పరిశీలించారు. ఈఓ కూర్మారావు పాల్గొన్నారు.

టీడీపీది ఓర్వలేనితనం

పొందూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి గ్రామాల్లో వస్తున్న స్పందనను చూసి ఓర్వలే టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బాడాన వెంకటకృష్ణారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించినన్ని సంక్షేమ పథకాలను గతంలో ఏ ప్రభుత్వమూ అందించలేదన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందడంతో వారంతా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తున్నారని, దీనిని చూసి టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు.